క్లుప్తంగా

తడిసిన మొక్కజొన్న,తెల్ల జొన్నలను కొనుగోలు చేస్తాం



రేటూరు(కాకుమాను): రెండు రోజులుగా గ్రామాలలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పంటలను నష్టపోయిన రైతులెవరు అధైర్య పడాల్సిన అవసరం లేదని డీఏఓ నున్న వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని రేటూరులో అధిక వర్షాల కారణంగా నీట మునిగిన మొక్క జొన్న పైరును శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాల కారణంగా పంటలను కోల్పోయిన రైతులెవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదని పంట నష్టపోయిన ప్రతి రైతుకి ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన తెలిపారు. వ్యవసాయ సిబ్బంది గ్రామాలలో పర్యటించి పంటలను కోల్పోయిన రైతుల వివరాలను త్వరలో సేకరిస్తారని ఆయన తెలిపారు. పంట నష్టపోయిన ప్రతి రైతుకి త్వరలోనే ప్రభుత్వం పంట నష్టపరిహారం అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పొన్నూరు ఏడీఏ తిరుమలాదేవి,ఏఓ కె.కిరణ్మయి, రైతులు, వ్యవసాయ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ఏటుకూరు గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం

గుంటూరు రూరల్: వేసవిలో విద్యార్థుల కోసం వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఏటుకూరు గ్రంథాలయ అధికారి పి.పరమేశ్వరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8వ తేదీ నుంచి జూన్ 11వ తేదీ వరకూ ఈ విజ్ఞాన శిబిరం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పుస్తక పఠనం, చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్స్, స్పోకెన్ ఇంగ్లిష్, వంటివి శిక్షణ ఇస్తారన్నారు. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఏటుకూరులోని గ్రంథాలయంలో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని శిక్షణ పొందవచ్చని తెలిపారు.

పెదకాకాని గొడపాలెంలో చోరీ

పెదకాకాని: గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి చోరీ చేసిన సంఘటన పెదకాకానిలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం పెదకాకాని గొడ పాలెంలో నివాసముండే కె.హరిబాబు ఆర్టీసీ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. ఎప్పటి మాదిరిగానే శుక్రవారం రాత్రి విధులకు హాజరయ్యారు. ఇంట్లో ఒంటరిగా ఉంటున్న భార్య సమీపంలో ఉన్న బంధువుల ఇంట్లో నిద్రించింది. శనివారం ఉదయానే ఇంటికి వచ్చి చూసేసరికి తలుపులు తెరిచి ఉన్నాయి. లోపల బీరువా పగలగొట్టి 70 వేల నగదు, 9 శవిరీలు బంగారం ఎత్తుకెళ్లారు. బాధితులు జరిగిన సంఘటనపై పెదకాకాని పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీంను రప్పించి వేలిముద్రలు, ఆధారాలు సేకరించారు.

వాగులో పడి యువకుడు గల్లంతు

పెదనందిపాడు: చేపలు పట్టటానికి వచ్చిన యువకుడు వాగులో పడి గల్లంతయిన ఘటన పెదనందిపాడులో చోటుచేసుకుంది. శనివారం సాయంత్రం పెదనందిపాడు ఎస్‌ఐ అబ్దుల్ రెహమాన్ తెలిపిన వివరాల ప్రకారం గుంటూరుకు చెందిన ఈశ్వర్ (40) చేపలు పట్టడానికి తన స్నేహితులు ఎం సుబ్బారావు, ఎం.వెంకటేష్‌లతో కలిసి శనివారం మధ్యాహ్నం నల్లమడ వాగు వద్దకు వచ్చారని, చేపలు పట్టే క్రమంలో ఈశ్వర్ అదుపుతప్పి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, గత ఈతగాళ్లను రప్పించామని, ప్రస్తుతం వర్షం పడుతుండటంతో వెతకటానికి వీలు పడలేదని, ఆదివారం ఉదయం వెతికించనున్నట్లు ఆయన తెలియజేశారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన



చేబ్రోలు: చేబ్రోలు మండలంలో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న, జొన్న, మిర్చి, పసుపు పంటలను వ్యవసాయ శాఖ, ఉద్యానవనశాఖాధికారులు శనివారం పరిశీలించారు. ఏవో బి.శ్రీనివాసనాయక్, హెచ్‌వో పి.ఉష, వ్యవసాయశాఖ సిబ్బంది మండల పరిధిలోని గొడవర్రు, గుండవరం, నారాకోడూరు గ్రామాల్లో కల్లాల్లో వర్షపునీటిలో ఉన్న పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. వర్షాలకు నీట మునిగి పాడైపోయిన పంటలను మెరక ప్రాంతాల్లోకి తరలించి ఆరబెట్టాలని సూచించారు. మొక్కజొన్న, జొన్న కల్లాల్లో క్వింటాకు ఒక కిలో చొప్పున కల్లు ఉప్పు చల్లటం వల్ల మొలకను నివారించవచ్చునన్నారు. పొలాల్లో విరిచిన మొక్కజొన్న కండెలను ఉప్పు ద్రావణాన్ని చల్లి ఆరబెట్టాలని తెలిపారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభమైందని మద్దతు ధర క్వింటా రూ.1962లకు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. స్థానిక ఆర్‌బీకే లవద్ద రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ, ఉద్యానవనశాఖ సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.

అన్నదాతల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య
- వర్షానికి తడిచిన జొన్న, మొక్కజొన్న పంటను పరిశీలన
- అకాల వర్షాలకు పంట నష్టపోయిన ప్రతి రైతునూ ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా
- ప్రభుత్వ పథకాలపై దుష్ప్రచారాలు చేస్తున్న టీడీపీ నాయకులు



ఉప్పలపాడులో వర్షానికి దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, రైతులు

పెదకాకాని: అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. మండలంలోని ఉప్పలపాడు, గోళ్ళమూడి గ్రామాలలో అకాల వర్షాలకు దెబ్బ తిన్న మొక్కజొన్న, జొన్న పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా పంట దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. వ్యవసాయ అధికారులు వెంటనే పంట దెబ్బ తిన్న పొలాలను పరిశీలించి పంట నష్టం అంచనా నివేదిక అందజేయాలన్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను అందుబాటులోకి తీసుకు వచ్చి అన్నదాతలు లాభసాటి వ్యవసాయం చేయాలనే ఆశయంతో ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను అందుబాటులోకి తీసుకు వచ్చిందన్నారు. దేశ చరిత్రలో రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరలు కల్పించడంతో పాటు ఆ ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తున్న ఘనత సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రభుత్వం పారదర్శకంగా ఈ క్రాప్ బుకింగ్ ద్వారా రైతులు సాగు చేస్తున్న పంటను నమోదు చేసి గిట్టు బాటు ధరకు కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ఉచితంగా పంట భీమా నమోదు చేయడం, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు నష్టపరిహారం సకాలంలో అందజేయడం జరుగుతుందన్నారు. జొన్న, మొక్కజొన్న పంటను పరిశీలించి రైతులతో మాట్లాడారు. గతంలో మాదిరిగానే త్వరలో పంట నష్టపరిహారం అందజేయడం జరుగుతుందన్నారు.

టీడీపీ నాయకులు దుష్ప్రచారాలు మానుకోవాలి

ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుంటే టీడీపీ నాయకులు దుష్ప్రచారాలు చేస్తున్నారని ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య ఆరోపించారు. గత ప్రభుత్వంలో రుణమాఫీ చేస్తానని అమలు కాని హామీలు ఇచ్చి రైతులను మోసం చేసిన సంగతి గుర్తు చేశారు. రైతులకు 1.5 లక్షలు రుణమాఫీ చేస్తానని ధ్రువీకరణ పత్రాలు అందజేసి ఐదేళ్ళ పాలనలో కేవలం 90 వేలు రూపాయలు మాత్రమే ఇచ్చి మొండి చెయ్యి చూపించిందన్నారు. రైతుల సంక్షేమం గురించి ఏనాడు పట్టించుకోకపోవడమే కాకుండా, వ్యవసాయ దండగ అని పేర్కొన్న టీడీపీ ప్రభుత్వం రైతుల సంక్షేమం గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం రైతు భరోసా పథకం ద్వారా ప్రతి ఏటా రైతుల బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేస్తున్నారని గుర్తు చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ ఏడిఏ శ్రీనివాసరావు, ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, ఏఓ పి సంధ్యారాణి, స్థానిక నాయకులు దంతాల వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, పల్లెంపాటి శ్రీనివాసరావు, చెన్నుపాటి కళ్యాణ్, బందెల ఉదయ్‌శంకర్, ముద్రబోయిన వెంకటేశ్వరరావు, ఫ్రాన్సిస్, చాగంటి మురళీమోహన్‌రెడ్డి, వెంకట్రావు, రైతులు, వీఏఏలు పాల్గొన్నారు.

ఘనంగా శివాలయ వార్షికోత్సవం



వెండి శాటారును బహుకరిస్తున్న వీరజయలత, రామకృష్ణారావు

పెదనందిపాడు: గ్రామంలో వేంచేసి ఉన్న గంగాభ్రమరాంబ సమేత చెన్నమల్లేశ్వర స్వామి, శ్రీదేవి భూదేవి సహిత చెన్నకేశవ స్వామి వార్ల పునః ప్రతిష్ఠ జరిగి సంవత్సరం అయిన అంగరంగ వైభవంగా జరిగింది. శనివారం ఉదయం మండల పరిధిలోని వరగాని గ్రామంలో గంగాభ్రమరాంబ సమేత చెన్నమల్లేశ్వర స్వామి, శ్రీదేవి భూదేవి సహిత శ్రీ చెన్నకేశవ స్వామి వార్షికోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా దేవాలయాన్ని విద్యుత్ దీపాలంకరణలో సుందరంగా అలంకరించారు. ప్రథమ వార్షికోత్సవం సందర్భంగానున్న వీరజయలత, రామకృష్ణారావు దంపతులు 25 వేల రూపాయిల విలువ గల స్వామి వారికి వెండి శటారును ఆలయ ధర్మకర్తలు పాతూరి శ్రీనివాస్, జ్యోతి దంపతులకు అందజేశారు. దాతలు, గ్రామస్తులు సహకారంతో సాయంత్రం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొని స్వామి వార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నాగులపాడులో వైభవంగా కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

పెదనందిపాడు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి వారి కల్యాణం కన్నుల పండుగగా జరిగింది. శనివారం ఉదయం మండల పరిధిలోని నాగులపాడు శ్రీ సుబ్రమణ్యేశ్వర స్వామి (నాగులపాడు పుట్ట) దేవస్థానంలో జరిగిన కల్యాణానికి పలు జిల్లాలనుండి భక్తులు వచ్చి ఈ కల్యాణాన్ని వీక్షించారు. ప్రతి సంవత్సరం జరిగే ఈ కల్యాణం బాగా జరుగుతుందని భక్తులు తెలిపారు. రమేశ్ శర్మ, పవన్ కుమార్ శర్మల ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణం కన్నుల పండుగగా జరిగింది. ఈ కల్యాణ ఘట్టాన్ని భక్తులకు అర్థమయ్యేలా భక్తులకు అర్చకులు వివరించారు. 45 మంది దంపతులతో స్వామి వారి కల్యాణం జరిపించారు. కల్యాణం జరిగినంతసేపు భక్తులు ఓపికతో కూర్చొని కల్యాణాన్ని వీక్షించారు. కల్యాణం అనంతరం తలంబ్రాలు కార్యక్రమం కన్నుల పండుగగా జరిగింది. దాతలు, గ్రామస్తులు సహకారంతో భక్తులకు 10 వేల మందికి అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి చుట్టు ప్రక్కల గ్రామాలవారే కాక పలు జిల్లాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు. కల్యాణం అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పది పరీక్షల్లో పెరిగిన ఉత్తీర్ణత శాతం

- సత్తా చాటిన విద్యార్థులు
- ప్రభుత్వ ప్రోత్సాహంతోనే సత్ఫలితాలు

పెదకాకాని: విద్యావ్యవస్థలో ప్రభుత్వం చేపట్టిన మార్పులు, ప్రోత్సాహం సత్ఫలితాలు ఇచ్చిందని ప్రధానోపాధ్యాయిని సీహెచ్ కళ్యాణి అన్నారు. పెదకాకాని మండలం వెనిగండ్ల జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం పది పరీక్షా ఫలితాలను పురస్కరించుకుని పాఠశాలలో ఉత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థులకు పుష్పాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం కళ్యాణి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అమ్మఒడి పథకం, మనబడి నాడు నేడు, విద్యాకానుక, జగనన్న గోరుముద్ద, పోషకాహారంగా చిక్కీ, గ్రుడ్డు, పోహ కారం అందించడంతో పాటు పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు పది పరీక్షా ఫలితాల్లో మంచి ఫలితాలు సాధించడానికి దోహదపడ్డాయన్నారు. ఉత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థులను ఎంఈఓ డి బలిరాం, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రైవేటు పాఠశాలల్లోనూ ఉత్తీర్ణతలు

మండలంలో ఐదు ప్రైవేటు పాఠశాలల నుంచి 216 మంది విద్యార్థులు పెది పరీక్షలకు హాజరు కాగా 201 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.

'పది' ఫలితాల్లో సత్తా చాటిన 'సర్కార్ స్కూల్స్'

ప్రత్తిపాడు: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 'పది' ఫలితాల్లో మెరిశారు. సర్కారు బడుల సత్తాను చాటుతూ అత్యుత్తమ మార్కులు సాధించారు. ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు మండలాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 37 మంది విద్యార్థులు 500 మార్కులుపైగా సాధించగా, అందులో 17 మంది విద్యార్థులు 550కు పైగా మార్కులు వచ్చినవారున్నారు. ప్రత్తిపాడు మండల ఉత్తీర్ణత శాతం 63.33 కాగా, వట్టిచెరుకూరు మండల ఉత్తీర్ణతా శాతం 76.45 శాతం అని ఆయా మండలాల ఎంఈవో సీహెచ్ రమాదేవి తెలిపారు.

ప్రత్తిపాడు మండలంలో..

ప్రత్తిపాడు మండలంలో ఎనిమిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలున్నాయి. వాటిలో కోయవారిపాలెం పాఠశాల 88 శాతం ఉత్తీర్ణతతో మండలంలో మొదటి స్థానంలో నిలవగా, చినకోండ్రుపాడు పాఠశాల దారుణంగా 32.86 శాతం ఉత్తీర్ణతతో అట్టడుగు స్థానంలో నిలిచింది. యనమదల హైస్కూల్ 61.86 శాతం, చినకోండ్రుపాడు హైస్కూల్ 32.86 శాతం, తిక్కిరెడ్డిపాలెం 87.50 శాతం, వంగిపురం హైస్కూల్ 84 శాతం, కోయవారిపాలెం హైస్కూల్ 88.46 శాతం, గొట్టిపాడు హైస్కూల్ 74.60 శాతం, ప్రత్తిపాడు హైస్కూల్ 62.68 శాతం, పాతమల్లాయపాలెం హైస్కూల్ 82.34 శాతం ఉత్తీర్ణత సాధించాయి. పలు హైస్కూల్స్‌కు చెందిన కె ప్రియాంక, ఎన్‌టి సాయిరామ్, కె రాఘవేంద్ర, కె రోహిత్‌లు అత్యధిక మార్కులు సాధించారు.

వట్టిచెరుకూరు మండలంలో..

వట్టిచెరుకూరు మండలంలో 9 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలున్నాయి. కాట్రపాడు హైస్కూల్ 90 శాతం ఉత్తీర్ణతతో మండలంలో ప్రథమ స్థానం సాధించగా, వట్టిచెరుకూరు హైస్కూల్ 61.22 శాతంతో చివరి స్థానంలో నిలిచింది. వింజనంపాడు హైస్కూల్ 76.92 శాతం, కొర్నెపాడు హైస్కూల్ 84 శాతం, అనంతవరప్పాడు హైస్కూల్ 82.76 శాతం, గారపాడు హైస్కూల్ 68.09 శాతం, కాట్రపాడు హైస్కూల్ 90 శాతం, వట్టిచెరుకూరు 61.22 శాతం, ముట్లూరు 82.22 శాతం, పల్లపాడు హైస్కూల్ 76 శాతం, సెయింట్ గ్జేవియర్స్ హెచ్ ఎస్ ముట్లూరు హైస్కూల్ 63.16 శాతం ఉత్తీర్ణత సాధించాయి.

గురుకుల బాలికల విద్యార్థినుల హవా

కాకుమాను: గత నెలలో జరిగిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో స్థానిక డాక్టర్ బీఆర్.అంబేద్కర్ గురుకుల (బాలికల)పాఠశాల విద్యార్థినిలు అత్యంత ప్రతిభకనబరిచారు. గురుకుల పాఠశాల నుంచి మొత్తం 72 మంది విద్యార్థినిలు పరీక్షలకు హాజరు కాగా వారిలో 59 మంది ఉత్తీర్ణిత సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ జ్ఞానప్రసూనాంభ తెలిపారు. వీరిలో పాఠశాలలో విద్యనభ్యసించిన ఎస్.విజయ నిర్మల అత్యధిక మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు.

పెదనందిపాడులో...

పెదనందిపాడు: పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో మండలంలో 81 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో డి.బాల సుబ్రమణ్యం తెలిపారు. శనివారం రాష్ట్ర వ్యాప్తంగా విడుదలైన పరీక్ష ఫలితాల్లో 361 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవ్వగా అందులో 295 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా పాఠశాలల వారీగా ఉత్తీర్ణత వివరాలను తెలియజేశారు. కొప్పర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 29 మంది విద్యార్థులకు 25 మంది, అన్నపర్రు కెఎస్‌ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 24 మందికి గాను 20 మంది, గొరిజవోలు గుంటపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 11 మంది గాను 7 మంది, అబ్బినేనిగుంటపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 13 మందికి గాను 10 మంది, గోగులమూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 30 మందికి గాను 26 మంది, పెదనందిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 61 మందికి గాను 35 మంది, ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10 మందికి గాను 9 మంది, పాలపర్రు నరసింహోన్నత పాఠశాలలో 15 మందికి గాను 9 మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు.

కేర్ డెంటల్ కళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ సయ్యద్‌రసూల్

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాల దిశగా కృషిచేయాలని కేర్ డెంటల్ కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ సయ్యద్‌రసూల్ తెలిపారు. శనివారం పొత్తూరు గ్రామంలోని కళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా కళాశాలలో చేరిన విద్యార్థులను తమ సహోదరులుగా భావించి వారికి ఎటువంటి సమస్య వచ్చినా, విద్యాభ్యాసంలో డౌట్స్‌ను సీని యర్ విద్యార్థినులు పరిష్కరించాలన్నారు. జూనియర్ సీనియర్ అనే భేదాలు లేకుండా కలిసిమెలసి ఉండాలన్నారు. చదువును నిర్లక్ష్యం చేయకుండా తల్లిదండ్రులు మీపై పెట్టుకున్న ఆశలు, ఆశయాలకు అనుగుణంగా చక్కగా చదువుకోవాలన్నారు. ప్రతి విద్యార్థికి ఉజ్వల భవిష్యత్‌ను కల్పించేందుకు కళాశాల ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ సయ్యద్ జీనత్, డైరెక్టర్స్ సమీన, మోహిద్దీన్, ప్రిన్సిపల్ డాక్టర్ జాకీర్ హుస్సేన్, డాక్టర్ మహబూబ్, డాక్టర్ స్మిత పాల్గొన్నారు.

వసతి గృహాల్లోనూ అధ్యయనానికి పూర్తి వసతులు

- ప్రశాంత వాతావరణంలో చదువుకునేందుకు పూర్తి వసతులు
- వీసీ ఆచార్య రాజశేఖర్
- బాలుర వసతి గృహాలలో రీడింగ్ రూమ్స్ ప్రారంభం



రీడింగ్ రూంలో వసతులు పరిశీలిస్తున్న వీసీ ఆచార్య పి రాజశేఖర్

ఏఎన్‌యూ: వసతి గృహాల్లో విద్యార్థులు ప్రశాంతంగా చదువుకునేందుకు అన్ని వసతులు కల్పిస్తున్నామని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ వెల్లడించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బాలుర వసతి గృహాలలో ఏర్పాటు చేసిన రీడింగ్ రూమ్స్ ప్రారంభోత్సవం శనివారం జరిగింది. రీడింగ్స్ రూమ్స్‌ను విద్యార్థుల చేతులమీదుగా ప్రారంభింపజేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ యూనివర్సిటీ కళాశాలల్లోని లైబ్రరీలతోపాటు వసతి గృహాలలో కూడా విద్యార్థులకు ప్రశాంతమైన వాతావరణం, వసతులు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు ఈ వసతులను సద్వినియోగం చేసుకుని విద్య, భాష, భావవ్యక్తీకరణ నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ మాట్లాడుతూ గతంలో మెస్‌హాల్స్‌ను ఆధునిక వసతులతో రీడింగ్ రూమ్స్‌గా విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చామన్నారు. పోటీ పరీక్షలకు కూడా సిద్ధమయ్యే అన్ని వసతులు ఉన్నాయన్నారు. సీడీసీ డీన్ ఆచార్య కె.మధుబాబు మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం 6 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు ఈ రీడింగ్ రూమ్స్ విద్యార్థులకు అందుబాటులో ఉంటాయన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని వసతులు కల్పించనున్నామన్నారు. బాలుర వసతి గృహాలలోని నాలుగు వసతి గృహాలలో ప్రత్యేకంగా రీడింగ్ రూమ్స్ అందుబాటులోకి తేవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పలువురు వార్డెన్లు, ఇంజినీరింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

సృజనాత్మకతతో విశ్వజనీయ అవకాశాలు

- వీసీ ఆచార్య పి.రాజశేఖర్
- ఘనంగా ఏఎన్‌యూ ఆర్కిటెక్చర్ కళాశాల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



ప్రసంగిస్తున్న వీసీ ఆచార్య పి రాజశేఖర్, వేదికపై యూనివర్సిటీ అధికారులు

ఏఎన్‌యూ: విద్యాపరమైన డిగ్రీతోపాటు సృజనాత్మకతను పెంపొందించుకుంటే విశ్వజనీయమైన అవకాశాలు పొందవచ్చని వీసీ ఆచార్య పి రాజశేఖర్ అన్నారు. ఏఎన్‌యూలో శనివారం జరిగిన యూనివర్సిటీ ఆర్కిటెక్చర్ కళాశాల గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు వీసీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వీసీ ప్రసంగిస్తూ విద్యార్థులు విశ్వవిద్యాలయంలో నేర్చుకున్న విలువలతో కూడిన విద్యా నైపుణ్యాలను సమాజ శ్రేయస్సుకు ఉపయోగించాలని సూచించారు. ప్రపంచ దేశాల సంస్కృతి సాంప్రదాయాలపై నిశిత పరిశీలన చేయడం వంటి వాటి ద్వారా మెరుగైన జీవన విధానం అలవడుతుందని తెలిపారు. భవిష్యత్తులో విద్యార్థులు ఎంపిక చేసుకున్న రంగంలో స్థిరపడి విలువలతో కూడిన సేవలు అందించాలని సూచించారు. ప్రపంచంలో ఎక్కడ ఏ స్థాయిలో ఉన్నా తల్లిదండ్రులను, విద్యాబుద్ధులు నేర్పిన గురువులను, పుట్టిన ఊరుని మరిచిపోవద్దన్నారు. విశ్వ విద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ మాట్లాడుతూ ఆర్కిటెక్చర్ కళాశాల విద్యార్థులకు బోధనాపరమైన అంశాలతోపాటు నైపుణ్యంపై ఆసక్తి ఉండాలన్నారు. భవిష్యత్ లో ఉత్తమ వ్యక్తులుగా ఎదగాలని ఆకాంక్షించారు. రెక్టార్ ఆచార్య పి.వర ప్రసాద మూర్తి మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభ్యాసం ఇంతటితో నే ముగియకూడదని మరెన్నో ఉన్నత చదువులు, పరిశోధనలు చేయాలని సూచించారు. నూతన జాతీయ విద్యావిధానంలో అనేక నైపుణ్య సంబంధిత కోర్సులు అందుబాటులో ఉన్నాయని వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని మంచి భవిష్యత్ రూపొందించుకోవాలన్నారు. అనంతరం ఆర్కిటెక్చర్ విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందజేశారు. ప్రిన్సిపాల్ ఈ. శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించారు.

వ్యాయామంతో స్పాండిలైటిస్ తగ్గించవచ్చు

గుంటూరు మెడికల్: యాంక్లోజింగ్ స్పాండిలైటిస్ అనేది దీర్ఘకాలిక సమస్య అని గుంటూరు రుమటాలజీ అండ్ ఇమ్యునాలజీ సెంటర్ అధినేత డాక్టర్ మానుకొండ మురళీకృష్ణ చెప్పారు. యాంక్లోజింగ్ స్పాండిలైటిస్ డే సందర్భంగా శనివారం కొత్తపేటలోని హాస్పటల్‌లో అవగాహన సదస్సు జరిగింది. సదస్సులో రుమాలజిస్ట్ డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ పొద్దున్న నిద్ర లేవగానే, ఎక్కువసేపు కూర్చున్న తరువాత, లాంగ్ డ్రైవ్ తరువాత, వంగి లేస్తున్నప్పుడూ, బరువులు ఎత్తినప్పుడూ బాక్ పెయిన్ వస్తుంటే జాగ్రత్తపడాలన్నారు. యాంక్లోజింగ్ స్పాండిలైటిస్ ఒక రకమైన ఆర్థరైటిస్ అని. ఇది వ్యక్తి యొక్క వెన్నుముకను ప్రభావితం చేస్తుందన్నారు. స్పైన్‌లో ఉన్న జాయింట్స్ ఇన్‌ఫ్లేమ్ అవ్వడం వల్ల ఇది వస్తుందని పేర్కొన్నారు.ఈ సమస్య టీనేజ్ లో, ఇరవై నుండి 40 ఏళ్ళ మధ్యలో ఏర్పడుతుందని, మహిళలకంటే మూడు రెట్లు ఎక్కువగా పురుషులు ఈ సమస్య బారిన పడుతున్నట్లు వెల్లడించారు. యాంక్లోజింగ్ స్పాండిలైటిస్ ఎందువల్ల వస్తుందో ఖచ్చి తమైన కారణాలు తెలియవని, వారసత్వంగా కూడా రావచ్చు అన్నారు. రక్తపరీక్షలు, ఎమ్మారై స్కాన్ పరీక్షల ద్వారా వ్యాధి నిర్ధారణ చేస్తారన్నారు. సమస్యని ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స చేస్తే సమస్య పెద్దది కాకుండా కట్టడి చేయవచ్చు అన్నారు.

వ్యభిచార నిర్వాహకులపై కేసు

గుంటూరు ఈస్ట్: వ్యభిచారం నిర్వహిస్తున్న ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కేవీపీకాలనీలో ఓ నివాసంలో వ్యభిచారం జరుగుతుందన్న సమాచారం మేరకు శనివారం పోలీసులు దాడిచేశారు. నిర్వాహకుడు, ఇద్దరు విటులు, ఇరువురు మహిళలను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. మహిళలను రెస్క్యూవ్ హోమ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భవనంపై నుంచి పడి మహిళ మృతి

గుంటూరు ఈస్ట్: మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న మహిళ భవనంపై నుండి కింద పడి మృతి చెందిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. లక్ష్మీపురం 4వలైనులోని ఓ అపార్టుమెంట్ నివాసం ఉంటున్న రవికుమార్తె తేజశ్వి (25) మానసిక అనారోగ్యంతో బాధపడుతోంది. శనివారం భవనంపై అంతస్తు నుండి కిందపడింది. కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాణ్యమైన సేవలను అందించేందుకే....

- జగనన్నకు చెబుదాం కార్యక్రమం
- నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ పెద్ది రోజా

నెహ్రూ నగర్: నాణ్యమైన ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించడమే జగనన్నకు చెబుదాం కార్యక్రమ లక్ష్యం అని నగర అదనపు కమిషనర్ పెద్దిరోజా పేర్కొన్నారు. శనివారం కమిషనర్ ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ పెద్ది రోజా శనివారం సాయంత్రం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాల్లో మే 9 నుంచి ప్రారంభం కానున్న స్పందన - జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై వివిధ విభాగాల అధికారులు, సూపరింటెండెంట్లు, స్పందన అధికారులు, ఆపరేటర్లకు, సచివాలయ కార్యదర్శులతో జూమ్ మీటింగ్ ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ పెద్దిరోజా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రజల సమస్యల పరిష్కారం కోసం అర్జీలు ఇచ్చే స్పందన కార్యక్రమం కన్నా మెరుగైన పరిష్కారం, అధికారుల్లో జవాబుదారీతనం కోసం మే నెల 9 నుంచి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నారన్నారు. ఇందులో భాగంగా ప్రత్యేకంగా 1902 హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశారని, హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి గ్రీవెన్స్ రిజిస్టర్ చేస్తే దాన్ని అత్యంత నాణ్యతతో పరిష్కరించాల్సి ఉంటుందన్నారు. పరిష్కారంపై అన్నిస్థాయిల్లో మానిటరింగ్ విభాగాలు కూడా ఉంటాయన్నారు. గ్రీవెన్స్ పరిష్కారంలో క్వాలిటీని పెంచడం అన్నది ప్రధా న లక్ష్యంగా కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారన్నారు. హెల్ప్ లైన్‌కు గ్రీవెన్స్ వస్తాయని వాటిని నిర్దేశిత సమయంలోగా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. ఐవీఆర్‌ఎస్, ఎస్‌ఎంఎస్‌ల ద్వారా తాము చెప్పిన సమస్యల పరిష్కారంపై ప్రజలకు క్రమం తప్పకుండా అప్‌డేట్స్ అందుతాయని, సమస్యల పరిష్కారంపై అర్జీదారుల నుంచి ఫీడ్ బ్యాక్ కూడా తీసుకుంటుందన్నారు.

వార్డు సచివాలయాల్లో వలంటీర్లు ప్రతి ఇంటినీ సందర్శించి 1902 హెల్ప్ లైన్ గురించి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు సి.హెచ్. శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, డి.సి.పి లు మూర్తి, కొటయ్య , ఈ.ఈ లు సుందర రామిరెడ్డి, కొండా రెడ్డి, సిఎంహెచ్‌ఓ విజయలక్ష్మి, ఎంహెచ్‌ఓ డాక్టర్ భాను ప్రకాష్, డి.ఈ లు, ఎ.సి.పి లు, టి.పి.ఎస్ లు , ఎ.ఈ లు, నగరపాలక సంస్థ మేనేజర్ శివన్నారాయణ, ఈ-డిస్ట్రిక్ అధికారి రత్నం, రెవెన్యూ అధికారులు, స్పందన అధికారులు, విభాగ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.